పెళ్ళికూతురుకి జడ వేస్తుంటే చూ స్తోంది శారద. ఫొటో ఫ్రేం కట్టినట్లు చేతి అద్దంలో ఆ పిల్ల ముఖం, ఆ ముఖంలో కనబడే ఆనందం శారదకి ముచ్చటగా వుంది.

# తుళ్ళిపడే వయసు

## సింగరాజు రామచంద్రమూర్తి

''నువ్వు జడవేయవా ఆంటీ'' అంది అసలు పావని.

''వద్దమ్మా. వేయక వేయక నేనేమిటి?'' అని తప్పించుకుంది శారద.

''నీకేమిటే- అలా అన్నిటికీ వెనక్కిపోతావు? నీ అంత అందమయిన కూతురు పుడుతుందనా లేక నీ కొడుకు లాంటి ప్రయోజకుడు,బుద్ధిమంతుడు కలుగుతాడని భయమా- ముందుకొచ్చి జడ ముట్టుకుంటే!'' కోప్పడింది పెద్ద ముత్తయిదువ ఒకావిడ - వరసకి మేనత్త అవుతుంది శారదకి!

నవ్వుకుంది శారద.

''ఆంటీ బాగుందంటే బాగున్నట్లు'' అంటోంది పావని.

తలెత్తకు. అలా అద్దలోంచే చూస్తే సినిమాల్లో హీరోయిన్ అంత అందంగా వున్నావు. నిజం పావనీ'' అంటూనే గభాలున మాట ఆపేసింది శారద. కారణం... ఆమె చూస్తున్న అద్దంలోనే మరొక ముఖం చాలా కాలం క్రితం అతి పరిచయమయిన ముఖం- తనకు అత్యంత సన్నిహితమయిన 'ఆయన' కనబడటమే!

''అదేమిటి ఆంటీ, జడ ఎలావున్నదీ చెప్పకుండానే...'' పావని గబుక్కున మాట ఆపేసింది. ఆ పిల్లకి చుట్టూవున్న వాతావరణం చాలా గంభీరంగా వున్నట్లనిపించడం వలన!

శారద మెల్లిగా లేచి నిలబడింది వెళ్ళిపోదామని! అక్కడ నిలబడటం ఆమెకు ఇబ్బందిగా వుండటం వలన.

ఆయన ఒకసారి ఆ ఆడవాళ్ళందరిని వంక చూసి, శారద వైపు నడిచి వచ్చి ''నీ కోసమే వచ్చాను'' అన్నాడు.

శారద గుండె ఝల్లుమంది! ''ఎన్ని ఏళ్ళయింది ఆ మాట విని!'' అంతలోనే తనని తను సంభాళించుకుంది. ''ఛీ, ఈ వయసులో ఈ మార్పేమిటి తనలో '' అని,

నిలదొక్కుకుని ''నన్నేనా మీ వుద్దేశ్యం?'' అంది నింపాదిగా.

''అతను. అలా వెడదామా?'' అన్నారాయన.

''పదండి'' అని హుందాగా ముందుకు నడిచింది.

ఇద్దరూ దూరంగా వున్న కుర్చీలవైపు వెళ్ళి అక్కడ నిలబడ్డారు. ఆయన కూర్చోకుంటే కూర్చోవాలని పించ లేదు శారదకి. ''కూర్చోండి'' అంది .

ఆయన నవ్వి, ''మరి నువ్వూ కూర్చో'' అన్నారు.

కాసేపు నిశ్శబ్దంగా కూర్చున్నారు.

''నీతో మాట్లాడాలని... ఐ మీన్ నిన్ను నాతో తీసుకు వెడదామని వచ్చాను'' అన్నారాయన.

ఈ సారి శారద ఒళ్ళు ఝల్లుమనలేదు. అందుకామె తనని తానే అభినందించుకుంది. ''మనసు కంట్రోల్లోనే వుంది'' అని.

''ఎన్ని సంవత్సరాలయుంటుంది మనం విడిపోయి'' అని నవ్వి ''మీరు నన్ను వదిలేసి'' అడిగింది శారద.

''మనం విడిపోయి, అనడమే కరెక్ట్.''

''లేదు. నేను ఇందులో నిమిత్త మాత్రురాలిని మాత్రమే! నేను మిమ్మల్ని వదలలేదుగా!... ఆనాడు మీరు నన్ను ఎందుకు వదిలారో ఇప్పటికీ నాకు తెలియదు. నిజం!''

''మీ ఇంటికి పెద్ద, మీ బావ చెప్పలేదూ?''

''లేదు. తరువాత్తరువాత నన్నెవరో అడిగారు. ''ఎవరితోనో పోతున్నానని మీ ఆయన నిన్ను వదిలేశారటగా!'' అని అప్పటికి నేనూ చిన్నదానినే కదా. ఇప్పుడా ప్రశ్న అడిగితే మాత్రం ''ఎవరితోనో పేరు చెప్పమనండి.వారితోనే పోతాను '' అనుండేదానిని.

ఆయన క్షణం ఆగి, ''మారావు మనిషివి'' అన్నారు.

నవ్వింది శారద. ''మారరా మరి? ఎంతకాలం - మనబ్బాయికి ఇప్పుడు ఇరవయి ఆరు. వాడికి మూడవ ఏట గదా సీతమ్మవారి గతి నీకు పట్టింది!''

''ఆవిడతో మనలాంటి వారికి పోలిక ఏమిటిలే.''

''ఇందాక నేనన్నమాట కేగా మీకు రోషం! ఈ కాలంలో ఆ సీతమ్మవారు సహితం ఆయనని నిలేసి అడిగుండేదేమో!... అయినా నేను మాత్రం మిమ్మల్ని ఆనాడు ఏమనగలిగాను? ఆడది ఎప్పుడూ పెద్దగా మారలేదు. అది మీ మగవాళ్ళ అదృష్టం'' అని నవ్వుతూ ''ఇంతకీ మీరు నన్ను వదిలిన కారణం చెప్పనేలేదు'' అంది.

''నిజంగా మీ బావ మీకు చెప్పలేదా?''

''దేముడి సాక్షిగా!''

''పోనీ కారణం అంత తెలియని దానివయితే మళ్ళీ వచ్చేందుకు నువ్వెందుకు ప్రయత్నం చేయలేదు?''

''అప్పటికి ఎంత చిన్నదానినయినా నాకూ పౌరుషం వుంటుంది కదా! కోర్టులలో లాంటిది శిక్ష వేసే ముందు చెప్పకోవలసింది ఏమయినా వుంటే చెప్పకోవచ్చు'' అని నవ్వి సర్లెండి ఆ వేడంతా తగ్గిపోయాక ఇప్పుడు పౌరుషాలు ఎందుకు? మా బావపోనే పోయాడు. మీరే చెప్పాలి ఇక. కంపల్షన్ ఏమీ లేదు. ఇష్టం వుంటే చెప్పండి. లేకపోతే ఇన్ని ఏళ్ళు కారణం తెలియకుండా గడపగా లేనిది మిగిలిన జీవితం గడవదా ఏమిటి?'' అంది శారద.

ఆయన క్షణం ఆగి ''నేను ఆస్తినంతా తగలేస్తున్నానుట, బాధ్యత తెలియకుండా!'' అన్నారు.

''అని ఎవరన్నారు?''

''ఇంకెవరు మీ బావ! అప్పుడు నేనడిగాను ''నన్ను చూసి చేశారా, నా ఆస్తిని చూశా నేను ఎలా ఖర్చు పెడితే మీ కెందుకు?'' అని. అప్పుడు ఆయన ఏమన్నారో తెలుసా? ''నిన్ను నీ ఆస్తిని - రెంటినీ కలిపి చూసి చేశాము'' అని.

నవ్వింది శారద. ''లేదా మరి? ఏ ఆడపిల్లనయినా ఇవ్వడం అలా అన్నీ చూసే కదా! మీకు ఆస్తిలేకపోతే కేవలం మీ ఉద్యోగం చూసి ఇచ్చేవారా మా నాన్నగారు? నేనసలు మీకు అందేదానినా?''

ఆయన ముఖం వివర్ణమయింది ''ఇదే అహంకారం. మీ బావకీను! అందువల్లనే నీకు న్యాయత రావలసిన ఆస్తిని మీకు అప్పచెప్పేశాను.''

''అది సగభాగమే! మరి మిమ్మల్ని కూడా చూసి కదా మా వాళ్ళు నన్ను మీకు చేసింది! సమాధానం చెప్పలేదు. పోనీ లెండి, అయిందేదో అయిపోయింది కదా! అసలు విషయం వదిలి మనం చాలాదూరం వచ్చాము కదూ'' నవ్వింది.

కాసేపు ఆగి ''నిన్ను నాతో తీసుకు వెళదామని వచ్చాను. అసలు నువ్వు వస్తావనే వచ్చా నీ పెళ్ళికి'' అన్నాడాయన.

శారద కాసేపు మవునం వహించింది ''మీరూ ఈ పెళ్ళికి వస్తారనే అనుకున్నాను గాని ఇలా అడుగుతారని అనుకోలేదు. అచ్చా, రేపు మీకూ సెలవే కదా - ఆదివారం! మీరు నా వెంట రాకూడదూ? ఎందుకు, ఏమిటి అని అడగకుండా రేపల్లా తిరగాలి సరా?''

''అదేమిటి ఈ వయసులో అదేం సరదా?''

నవ్వింది శారద ''సరదానే! చిన్నతనంలో మీ చిటికిన వేలుచ్చుకొని నేను తిరగాలి. ఇప్పుడు నాది మీరు.''

''నీ ఇష్టం.''

''రేపు ఉదయం మన ప్రయాణం. అప్పటిదాకా ఎవరి మార్గాన వారు - మీరు మగపెళ్ళివారి వైపు వారు కదా! నేనేమో - అదిగో పెళ్లికూతురు ముస్తాబుకి ఇన్‌ఛార్జిని'' అంటూనే వెళ్ళిపోయింది.

మర్నాడు బస్ ఎక్కడమే ఆడవాళ్ళ సీటులో తాను కూర్చుంది. ఆయన ఒక్కసారి ఆమెవంక చూసి వెనక్కి వెళ్ళి కూర్చున్నాడు.

సిటీబస్ కూడా ఎక్కి దిగాక నవ్వుతూ ''మళ్ళీ మనం ఏడు కాదు, చాలా అడుగులు కలిసి వేయాలి. ఒక్క మూడు నిముషాలు నడక'' అంది.

చిన్న డాబా ఇంటి ముందు ఆగి, ''ఇదే మనవాడి ఇల్లు, అద్దె కుంటున్నాం. ఇంకా కొనుక్కునే స్థోమతు ఎక్కడిది ఇప్పుడిప్పుడేగా సంపాయిస్తున్నాడు.మాశారా, రోజూ నన్ను వంటరిగా చూడడం అలవాటు ఈ పేటలోని వాళ్ళకి. ఇవ్వాళ వింతగా చూస్తున్నారు మనిద్దరి వంక!'' అని నవ్వి ''ఇప్పుడు కుమారుడికి షాక్ ఇద్దాం. కాలింగ్ బెల్ నొక్కండి'' అంది.

ఆయన మెల్లిగా సందేహిస్తున్నట్లు నొక్కాడు. సమాధానం లేదు.

ఆమె నవ్వింది. ''నేను ఇప్పుడిప్పుడే రానని వాళ్ళ వుద్దేశం. ఆపకుండా నొక్కండి.''

ఆయన ఇంకా సందేహిస్తూనే వుంటే ''పోనీ తలుపు తట్టండి'' అంటూ ఆమె ఆపకుండా తట్టిచూసి ''ఊ మీరు కానీయండి'' అంది.

ఆయన ఆపకుండా తలుపు తట్టసాగాడు. శారద ''నాన్నా విశ్వం'' అంటూ పిలవసాగింది పెద్దగా. రెండు మూడు నిముషాలు అలా అయినాక గభాలున తలుపు తెరుచుకుంది.



ఎదురుగా స్నానం చేస్తున్న బట్టలతో నిలబడి వున్న కొడుకుని చూసి నవ్వుతూ "ఏమిటిరా నాన్నా, స్నానం చేస్తున్నావా?" అనడిగింది శారద.

"అవునవును. స్నానం కరెక్ట్" అన్నాడతను.

అతని కంగారు చూసి మళ్ళీ నవ్వుతూ "అదే మిత్రా, తలనిండా పోసుకున్నట్టున్నావు! పిచ్చి సన్నాసి" అంటూనే అతని తలవెంట్రుకలు పట్టిచూపింది.

"అవునమ్మా, ఏదో హడావుడిలో" అంటూ తల మీద చేయి పెట్టుకుని "ఏమిటి తలమీద పోసేసుకున్నావా?"అన్నాడు.

"పోసుకున్నావో లేదో నీకు తెలియదా. ఏదీ తుడుచుకునే-టవలు?"

"అతను. ఏదీ - టవలేదీ?"

"చన్నీళ్ళు పోసుకున్నావా, అమ్మాయి లేవలేదా? వేడినీళ్ళు పెట్టలేదా?

అవునవును అమ్మాయి - ఐ మీన్ సరోజ ఏది?"

ఫకాలున నవ్వింది శారద "అదీ స్నానమేనా?..."

కరెక్ట్. కరెక్ట్. సరోజా స్నానం చేస్తున్నావా. చెయి చెయి" అన్నాడు పెద్దగా.

నువ్విటురా ముందు జలుబు చేస్తుంది "అంటూనే అతని తల పమిట చెరుగుతో తుడుస్తూ "కరెంటు లేదా ఏమిటి?" అంది.

"అవునమ్మా. వెధవది ఆదివారం కదూ పొద్దునే పోయింది."

అంతలోనే "ఏమత్తయ్యా, రాత్రే వస్తారని ఎదురు చూశాము" అంటూ దగ్గర కొచ్చింది సరోజ.

తడి వెంట్రుకలతో వున్న కోడలిని చూస్తూనే "అదేమిటే నువ్వూ తలనిండా పోసుకున్నావా?" అనడిగింది.

"అవునత్తయ్యా, నిన్న శనివారం కదా - మానెరాసుకోలే."

"కరెంటు లేక బాగా చెమటలు పట్టేశాయి కధా!" అంది శారద.

కోడలు ఒక్కసారి ఆమె వంక చూసింది. అంతలోనే ఆ అమ్మాయి ముఖంలోకి సిగ్గొచ్చేసింది. గభాలున లోపలికి పోబోయిన సరోజని చేయిపట్టుకుని ఆపి "ఇది మనకోడలు.నీకు మేనకోడలు - తెలుసుగా అప్పుడు అబ్బాయి వచ్చి రమ్మంటే మీరు రానని మొరాయించారు కూడా!" అంది—

"సరోజా, ఈయనే మీ మామగారంటే! నువ్వెప్పుడూ చూడలేదు కదూ!" అంది సరోజతో.

ఆయన వంక ఒకసారి చూసి, చూడలేదన్నట్లుగా తల అడ్డంగా తిప్పింది సరోజ.

తాను తుడవడం అయిపోయినా ఇంకా పమిట చెంగు అడ్డం పెట్టుకుని తుడుచుకుంటూనే వున్న కొడుకుని "పలకరించవా నాన్నగారిని?" అంది శారద మెల్లిగా అతని చెవిలో రహస్యం చెబుతున్నట్లుగా.

"ఊహు" అన్నాడతను.

"పెళ్ళికి వచ్చారు. ఇద్దరం కలిసి వచ్చాము - మిమ్మల్నిదరినీ చూపిద్దామని..."

శారదకి రెండు వైపులా చేరిపోయారు కొడుకూ, కోడలూ! "వీళ్ళిద్దరూ నాకు రెండు కళ్ళు. నేను లేనిదే వాళ్ళకి తోచదు. వాళ్ళు కనబడనిదే నాకు నిద్రపట్టదు. ముగ్గురం పడయ్యేదాకా ఒక మంచంమీదనే పడుకుంటాం" అని నవ్వుతూ "నాకు త్వరగా మనవళ్ళు పుట్టాలంటే నేను తీర్థయాత్రలకి వెళ్ళడం ఒక్కటే మార్గం అనుకుంటాను" అంది.

ఫొటోగ్రాఫులోలా కనబడుతున్నారు వాళ్ళు ముగ్గురూ ఆయన కంటికి!

## దమన నీతి

చెట్టు మీద పిట్టలు
గట్టు మీద పుట్టలు
పట్టునున్న గుడ్డులు
పొట్టనెట్టు నాగులు
నెట్టలేవు కొట్టలేవు
రోదనెట్టు పిట్టలు

పుట్టలోని నాగులు
గట్టుమీద ముంగిస
పుట్టనున్న నాగును
పొట్టనెట్టు ముంగిస
నెట్టలేవు చుట్టలేవు
బుసలు కొట్టు నాగులు

పిట్టలు చెట్టున పట్టులు
పెట్టకుండ లేవు
పట్టువిడిచి నాగులు
మట్టుగుండలేవు
నాగు విడిచి ముంగిసలు
గుట్టుగుండలేవు

విషజీవిత మనుసరించె
మానవ కోటి
అదే రీతి ఇదే నేటి
దమన నీతి
రాదా నాటి మమత తోటి
నరుని నీతి
నీతిబాట వేయవోయి
కరుణతోటి

—అంట్యాకుల పైడిరాజు

"మొన్నరాత్రి ఏం వండి పెట్టాడే సరోజా మీకు?" అడిగింది శారద.

"ఏమిటేమిటమ్మా, స్టార్ హోటల్ మెనూ! అన్ని పదార్థాలు తినలేక చాలా బాధపడింది పాపం!"

"అది కాదత్తయ్యా, నీకు ఏమేం కావాలి?" అని అడిగారు. నిజం అనుకుని చెప్పాను. "కళ్ళు మూసుకో" అని ఒక కాగితం మీదఅవన్నీ రాసి నా ముందు పెట్టి "ఇవి చూసుకుంటూ తిను. కడుపు నిండిపోతుంది. హిప్నాటిజం అన్నమాట. "నేను తింటున్నాను. తింటున్నాను" అనుకుంటుంటే...నిజం నరూ అన్నారు" అంటూ నవ్వింది.

అయితే నువ్వుకూడా ఒకపని చేయవే- వాడికి నీ ఫొటో ఇచ్చి వూరెళ్ళిపో నీకు నిన్న స్నానానికి వేడినీళ్ళు పెట్టాడా, అదీ హిప్నాసిస్ పద్ధతేనా?"

"వేడి నీళ్ళా - నర్లెండి" తొమ్మిది గంటల దాకా ఆగుతే అప్పుడు ఆలోచిస్తానన్నారు" చన్నీళ్ళు పోసుకుని ఇంట్లోకి వచ్చేసాను.

అందువల్ల నువ్వీ రోజు వాడికి చన్నీళ్ళు ఇచ్చావన్న మాట!"

"చన్నీళ్ళా - ఆయనా - శుభ్రంగా వేడినీళ్ళు పెడితేనూ!"

మరి ఈ స్నానం... అవునవును కరెంటులేక చెమటలు పట్టాయి కదూ" అని నవ్వి మెల్లిగా కోడలుతో "పొద్దున్నే అంతలా చెమట ఏమిటే... కరెంటు వుంది - మేము కాలింగ్ బెల్ నొక్కినపుడు మోగింది" అంది.

ఆ పిల్ల ముఖం సిగ్గుతో ఎర్రబడిపోయింది. లోపలికి పరుగెత్తింది. విశ్వం కూడా అనుసరించాడు.

"ఇదీ నా జీవితం. ఎంత ప్రేమో వీళ్ళకి నేనంటే" అంది శారద.

విన్నాను అన్నారాయన.

"మనం సాయంత్రం మా తమ్ముడింటికి వెడదాం. గుర్తున్నాడా వాడు?" అడిగింది శారద....

"ఇదిగో. ఈ తలుపు తీసినవాడే మా తమ్ముడు. పేరు"...

"అంజిబాబు" అన్నాడాయన అందుకుని.

"కరెక్ట్. అదుగో ఎదురుగా నడి మంచం మీద కూర్చుని మనం వచ్చినా లేవనిది నా మరదలు - ముద్దుల మరదలు."

"ముద్దుల భాగం ఎవరిది అక్కగారు" అనన్నాడు అంజిబాబు.

"ఏడిశావులే. నీకన్న చాల చిన్నది అది. మన విశ్వం ఈడుది... ఈయన దుష్యంతుడుగారు."

"వీరెవరు? అదేమిటి ఈయన బావగారు కదూ!"

లోపలినుంచి మీనాక్షి నవ్వుతూ "వదినా, ఇప్పుడు మీరు "నేను శకుంతలని" అన్నారేంటి ఆవిడెవరో ననుకుని తలుపేసేస్తారు గభాలున! సినిమాలు తప్ప పురాణాలలో మార్కులు సున్నా!" అంది.

"వెధవ, మాస్టారు బుద్ధి. ఎప్పుడూ మార్కులూ, సున్నాలు."

నవ్వింది శారద నీకెప్పుడూ సున్నాలే వస్తుందేమిటిరా?... ఏమే మీనా, వండాలిసి వస్తుందాని ముందే

జాగ్రత్త పడ్డావు.

"వంటొచ్చిన మీ తమ్ముడుండగా మీకా భయం లేదు. కంచం పెట్టుకునే లోపల వండేయగలరు. "నల మహారాజు" అని నవ్వి "ఖర్మ వీటిని ఎరగరీయన అంది."

"అయినా ఉద్యోగాలు చేస్తూ, ఉళ్ళేలగల జాణవి నీకూ ఈ మూడురోజుల పట్టింపులేమిటే మీనా?" అడిగింది శారద.

"అది ఆవిడ జన్మహక్కుట. ఉన్న సౌకర్యాలు వదులుకోదుట. సరేగాని, నిజంగానే లేవండి భోజనానికి. అన్నీనూ ఇంతకీ ... వీరు ... బావగారు... చాలాకాలానికి"...

"చాలా ఏళ్ళకి అను" నన్ను తీసుకు వెడతారుట!

"గుడ్ న్యూస్! చాలా మంచివార్త!"

"ఇంగ్లీషు నాకూ వచ్చు. అనుమానం అక్కర లేదు" అంది విసురుగా.

"సరిసరి. లేవండి - వడ్డనలు ప్రారంభం అవుతున్నాయి. మీనా, మందేసుకున్నావా?"

"మందేమిటిరా?"

"పూర్వం కాళ్ళు కడుక్కోండి" అనే వాళ్ళు వడ్డించే ముందు. ఇప్పుడు "మందులు వేసుకోండి" అనాలి. ఎరువులు, క్రిమి సంహారకాల కాలం కదా! అని నవ్వి "మా సగానికి" అంటే అర్థాంగికి చక్కెర వ్యాధి, అందువల్ల" అన్నారు.

"ఇంత చిన్న వయస్సులోనా?"

"మా నాన్నగారికి డయాబెటిస్" కదా వదినా, నాకు ఆయనిచ్చిన కానుక షుగర్ వ్యాధి. రోజూ మందేసు కోవాలి భోజనం ముందు. ఆ భోజనం కూడా ఆకులూ , అలములూను.

"రాత్రులు కంద మూలాలు" అన్నాడు అంజిబాబు.

"అతి జాగ్రత్తగా రోజూ తోటకూర వండిస్తారు మా శ్రీవారు. పొదుపు సంస్థలో ఆఫీసరు గదా అవే బుద్ధులు. అంతా బ్యాంకులో వేసేద్దామని!"

"మరే మరే. బ్యాంకులు నిండా మన డబ్బే."


"ఎక్కడ వచ్చిపోతానోనని భయం. మా వాళ్ళు వెర్రివాళ్ళు కావటాన నన్నిచ్చారు. లేకపోతే ఇంకా పాపం బ్రహ్మచారిగానే వుండవలసి వచ్చేది! ఇప్పుడిక చేసుకుందామన్నా ఇచ్చేవారు ఎవరు రెండవ పెళ్ళికి?"

"అటువంటి భయాలేమీ పెట్టుకోకు మీనాక్షమ్మా!" మా ఆవిడని నేను వదిలేస్తున్నాను. ఖాళీగా వున్నాను అని చిటిక వేస్తే క్యూలో నిలబడతారు. ఆడపిల్లలు, తండ్రులని వెంటబెట్టుకుని!

"అవునవును" అసలు మొదట పెళ్ళి మీకెలా అయిందో వింతగా వుంది మాస్టారూ, ఆ రహస్యం ఏమిటో చెప్పండి కాస్త అని అడిగేందుకు!

"క్యూ... క్యూ కాంప్లెక్స్ కట్టించాలి తిరుమల లోలా కదరా అంజీ" అంది శారద నవ్వుతూ.

"కరెక్ట్" అంటూనే మాత్ర తెచ్చి మీనాక్షికి ఇచ్చి, మంచినీళ్ళు పోసి " జాగ్రత్త. మెల్లిగా వేసుకో. ఊపిరి తిత్తులలోకి వెళ్ళిందంటే ఉత్తి పుణ్యానికి చస్తావు" అన్నాడు అంజిబాబు.




"చూశావా మీనా, నువ్వంటే మా వాడికి ఎంత శ్రద్ధ, ప్రేమానో?"

"ఆ, ఆ. నేను తెచ్చే జీతం మీదనో, నా మీదనో" అంది మీనాక్షి నవ్వుతూ. అంతలోనే "ఎంతసేపూ నా బాగోగులు చూస్తారే కాని తన శరీరం చూసుకోరు. ఏమయినా అంటే మనం ఏమిటనుకున్నావు. ఉక్కు. నాకెప్పుడయినా జ్వరం వచ్చిందా?" అంటారు. ఎంతలా వున్నా వయసు పెరిగే కొద్ది బలహీనపడరూ? ఆయన బాగుంటేనే కదా నా బాగు కూడా అంది. ఆమె గొంతు రుద్ధమయిపోయింది.

ఫక్కున నవ్వాడు అంజిబాబు." అమ్మాయి నీ పుస్తెలతాడు కేం ఢోకా లేదు. యమ స్ట్రాంగ్!"

"ఇదిగో ఇదీ వరుస. అసలీ మూడురోజులు కూర్చోవడం ఏమిటండి, నాకేం ఇబ్బంది లేదు."

"నేను వండగలను అంటే విననాదినా!" ఇద్దరం సంపాయిస్తున్నాము. నువ్వు వంట కూడా చేస్తున్నావు. అంటే నీకు అన్యాయం జరుగుతోందన్న మాట! కనుక ఈ మూడు రోజులూ నీకు నేను వండి పెట్టాలిసిందే అంటారు నాకు సరదానా - మొండి మనిషి ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి...

"మన మూడవ మజిలీ- మా అమ్మ, నాన్న! అసలు మిమ్మల్ని ముందు తీసుకు వెళ్ళవలసిన స్థలం అది. కాని ప్రాధాన్యతలు మారాయి ఈ ఆధునిక కాలంలో" అంది శారద.

ఒక చిన్న కుర్రాడు పేపరు చదువుతుంటే వింటూ మళ్ళీ వాడికి అర్థం చెబుతున్నారు కృష్ణయ్యగారు. ఆ కుర్రాడు శారదని చూడగానే "అత్తయ్య వచ్చింది" అన్నాడు ఆనందంగా.

"ఆయన తలెత్తి శారదతో వున్న ఆయన వంక నిశితంగా చూస్తున్నారు. గుర్తు పట్టారా నాన్నా, మీ అల్లుడు" అంది నవ్వుతూ.

"అవునవును" గుర్తుపట్టలేకనేమి - కళ్ళు నిక్షేపంగా అగపడతాయి. "అయితే ఆ కళ్ళని నమ్మలేక చూస్తున్నాను" అన్నారాయన లేచి కూర్చుంటూ.

"నిన్న పెళ్ళికి వెళ్ళానుగా. అక్కడికి వచ్చారు." అని నవ్వుతూ "ఇప్పుడీయన గతం,నా గతం చర్చలొద్దు నాన్నారు. నన్ను తనతో రమ్మంటున్నారు" అంది.

తనతోనా నమ్మలేనట్టుగా అడిగారాయన.

"అవును. అది కూడా నాకు వదిలేయండి. మందు వేసుకున్నారా?"

ఆయన అనుమానంగా "అవును, వేసుకున్నానా? ఏరా నాన్నా, వేశావా? మందుల సెక్షన్‌కి వీళ్ళమ్మ అదే మీ వదిన ఇన్‌ఛార్జి నీకు తెలుసుగా! శలవులొస్తే వీడు వాళ్ళమ్మకి అసిస్టెంటు. నాన్నా మందేశావుటయ్యా నాకు? అమ్మని అడిగిరా" అన్నారు.

"అదేమిటి తాతగారు, గొంతు రాయమన్నారు. రాశాను కూడా!"

నవ్వారాయన "అవునురోయ్ వేశాడమ్మా"

"ఏం మందేమిటి?" అడిగింది శారద.

"ఏం మందురా నాన్నా, అమ్మ నడిగిరా"

అదేమిటి తాతగారు మీకూ తెలుసుగా చూద్దాం మీకు జ్ఞాపక శక్తికి ఇవ్వాళ పరీక్ష. నువ్వు చెప్పకత్తయ్యా. పోనీ బామ్మని అడగండి.

"నాకే తెలియకపోతే ముసిల్దానికేం తెలుస్తుంది. ఏదోనమ్మా. వదిన వేస్తుంది. రక్తపోటుకి, అరుగుదలకి. నా బొందకి! బామ్మ ఏం చేస్తోందిరా నాన్నా?"

"అమ్మ పురాణం చదివి వినిపిస్తోంటే వింటోంది."

"ఇద్దరూ పుణ్యం సంపాయించుకుంటారు. చదివి కోడలు, విని అత్తగారు" అంటూ నవ్వారు. శారద నవ్వింది.

"చూడ మ్మా శారదా, "మాది" ,"మాకు" అనేవి పోయి చాలా కాలం అయింది. వదిన పాపం కూతురిలాగా చూస్తుంది. ఇద్దరికీ రోజంతా మందులు. మింగకపోతే కోప్పడుతుంది. రోజుల లెక్కపోయింది నాకు వీళ్ళే సూర్యచంద్రులు. ఇదిగో ఈ చంద్రుడు ఇంటిలో వుంటే ఆరోజు శలవన్న మాట"

"పెన్షన్ తెచ్చుకున్నారా"

"ఏరా నాన్నా తెచ్చుకున్నామా?"

# మర్నాడు

తలుపుతీసి చూస్తే -
ఏమిటీ చిందర వందర?
నిన్నటికీ,— ఈ నాటికీ
ఎంతభేదం వాకిటి ముందర?
**
ముత్యాలు రాల్చి రాల్చి
వీధంతా వెలుగుపంచి
పూలన్నీ ఎగజిమ్మి
చితికిపోయి, చిన్నబోయి
సగంకాలి ఆగిపోయి
ఎగరబోయి పేలిపోయి
పేలబోయి, వాలిపోయి
చేతుల్లో మండిపోయి
వంటరిగా పోరాడి
జంటలుగా పైకెగిరి
చిరిగి చిరిగి ముక్కలైన
కాగితాల శకలాలు
హిరోషిమా? నాగసాకి?
ఎన్నెన్నో భయానక దృశ్యాలు
నన్ను కలచి వేస్తుంటే—,
తలుపుతీసి చూస్తే—

ఏమిటీ చిందర వందర?
నిన్నటికీ - ఈ నాటికీ
ఎంతభేదం వాకిటి ముందర!
**
ఆకాశంలోంచి,
అమవస నిశిమించి,
పొంచి పొంచి చూసి,
పొందికగా దిగివచ్చి
దివ్వెలుగా మారి,
ప్రహరీపై వాలిన చుక్కలు
భారంగా, దీనంగా
చితికిన బ్రతుకుల్లా—,
వెలిసిన గాజుపూసల్లా,
చిన్నబోయి నిలిచాయి.
చమురులో వత్తి మురిగి
వెలగకనే మలిగిపోయి
మొగ్గలోనే తుంచబడిన
మగువ బ్రతుకు మాదిరిగా—,
రాత్రంతా వెలుగులతో

విర్రవీగి పోవాలని
ఆత్రంగా మండబోయి
అంతలోనే గాలి వచ్చి
శిరశ్ఛేద మొనరిస్తే
ఎదురు దెబ్బలకు చెదిరి,
తలవంచిన దీనుల్లా—,

కష్టాలన్నిటి కోర్చి
కడదాకా వెలగాలని
హరించుకుపోయే నూనెకి
నుసిబారె కొస వత్తికి
సమన్వయాన్ని కూరుస్తూ
ఎండిన ఆశల నిలిచిన
మధ్యతరగతి మందుడిలా—,

ఆరినదీపాల మారిన రూపాలు
కళ్ళు నులుముకుని చూశా—
నిన్నటికీ - ఈనాటికీ
ఎంతభేదం వాకిటి ముందర?
ఏమిటీ చిందర వందర!!!

— ఇంద్రగంటి జానకీబాల

నవ్వుతూ లోపలికి వెళ్ళిపోయింది శారద. "ఏం వదినా అమ్మకి పుణ్యం ఇప్పిస్తానంటూ నువ్వే ఎక్కువగా పంపాయించు కుంటున్నావుట. కంప్లెయింట్స్ వస్తున్నాయి అంది నవ్వుతూ శారద."

"కాసిని నీళ్ళు తీసుకు రా అది మొత్తం నీకు దానం ఇచ్చేస్తా... సరే గాని పెళ్ళికి వెళ్ళి ఏప్పుడొచ్చావ్? అంది జానకి."

"నిన్న. వంటరిగా కాదు, ఈయనతో అంటూనే అమ్మా, ఆయన వచ్చారు. నన్ను తనతో రమ్మంటున్నారు అంది.

ఆవిడ తలెత్తి "నిజమేనా తల్లీ! అంది"

అక్షరాలా గుర్తు పట్టావుగా వదినా నువ్వు! లేకపోతే ఎవరితోనయినా వచ్చావను కుంటుంది అమ్మ" అని నవ్వింది శారద. జానకీ నవ్వింది.

"ఇన్నాళ్ళ కన్నమాట. పోనీలేమ్మా, నీ కాపరం చక్కబడితే అవును గానీ నాయనా..."

"ఎటువంటి ప్రశ్నలు వద్దమ్మా..."

ఇద్దరూ రోడ్డు మీదకి వచ్చారు" అయిపోయింది. నేను చెప్పిన కార్యక్రమం. ఎన్నో దృశ్యాలు చూశారు. మొదటిది మీ కర్థమయింది చెప్పండి" అంది శారద.

"ఏంటది అందులో, నువ్వు వచ్చావన్న కంగారులో కొడుకూ, కోడలూ బయటకి వచ్చారు" అన్నాడాయన.

నవ్వింది శారద. అదే అర్థంఅయుంటే మీరు నన్ను ఎందుకు వదిలేస్తారు. వెబుతా వినండి. ఎప్పుడూ నేను ఇల్లు వదలను. వాడున్నంతసేపూ నేనూ వుంటాను. వాళ్ళకి ఏకాంతం దొరకదు. ఆ క్రితం రోజు సరోజకి స్నానం. ఆ మూడు రోజులూ ఎడబాటు, ఆ పైన ఏకాంతం... అటువంటి సన్నివేశంలో మనం వెళ్ళాం" అని తలవంచుకుని వాళ్ళ అలసట నాకు కనబడకుండా స్నానాలు చేసి వచ్చారు" అంది.

"కరెక్ట్. నాకు తోచలేదు" అన్నారాయన.

"రెండవది. ఆ వేడి కొంచెం చల్లారిన వయసు వాళ్ళు మా తమ్ముడూ వాళ్ళు. ఒకరి ఆరోగ్యం, ఒకరి బాగోగులు మరొకరు పట్టించుకోవడం, మాట వినడం లేదని బాధపడడం. ఇద్దరికీ తమ శ్రేయస్సు కన్నా ఎదుటివారిదే ముఖ్యం!"

"ఇక మూడవది - పెద్దవాళ్ళయి తమ బరువుని పిల్లల మీద పూర్తిగా వేసి నిశ్చింతగా వుండడం" అని కాసేపాగి నేను మొదటి రెండు దశలూ నష్టపోయిన దానిని. నా బరువు బాధ్యతల్ని అతి చిన్న వయస్సులోనే నా కొడుకు మీద వేసిన దానిని అదంతా మీ వలన.

"ఇప్పుడు మీరు నన్ను తీసుకు వెళ్ళగలరు గాని ఆ త్రుళ్ళిపడే వయస్సు నాకివ్వగలరా? నేను పోగొట్టుకున్న ఆ జీవితాన్ని మళ్ళీ సమకూర్చగలరా?" అంది.

కాసేపు మవునంగా నడక ఆపి నిలబడ్డారాయన. శారద కూడా ఆగింది. అప్పుడు మెల్లిగా అన్నాడాయన "ఒప్పుకుంటాను. ఇవ్వలేను. అయితే నన్ను వెళ్ళమంటావా?"...

"అలా అడిగారు నాన్నా మీ నాన్నగారు. నేనేమి చెప్పి వుంటాను చెప్పు" అనడిగింది కొడుకుని శారద.

"వెళ్ళమనుంటావు. అది కరెక్ట్ కూడ!" అన్నాడతను విసురుగా.

"వెళ్ళద్దు. నేనూ వస్తున్నానని చెప్పి వుంటారు" అంది సరోజ.

శారద క్షణం వాళ్ళవంక చూసి "అవును. అలానే చెప్పాను" అంది.

"మరి అలా వెళ్ళేదానివి ఇంత హంగామా ఎందుకు చూపించావు ఆయనకి" అన్నాడు విశ్వం కోపంగా.

"ఆయన నన్ను పిలవడం నాకేదో గొప్ప సాయం చేయడం కాదు అన్నది ఆయన గ్రహించాలి! జీవితంలో నన్ను నష్ట పరిచానని ఆయనకి తెలియాలి! అందుకని అర్థమయేలా చేశాను!!"

"చేసి?" రెట్టించాడు విశ్వం.

నవ్వింది శారద "ఆడది ఎప్పుడూ భర్తని క్షమించేస్తుంటుంది. అది దాని బలహీనత. ఇన్నాళ్ళూ నా బాధ్యత అంతా నెత్తినేసుకున్నావు. కొన్నాళ్ళు ఆయన్నీ మోయనియ్. తరవాత మళ్ళీ మా ఇద్దరి బరువూ నువ్వే మొద్దువుగాని......!!"*